కామెడీ కథ

# దటీజ్ గోపీ!

-స్వప్న కంఠంనేని తులశి



జిపక్, జిపక్‌మని రాణి కళ్ళ ముందు గులాబీ పువ్వుని ఊపాడు గోపి. ముళ్ళు కళ్ళల్లో గుచ్చు కుంటాయేమోనని రాణికి చచ్చేంత భయం వేసింది.

కళ్ళు గట్టిగా మూసుకుంది.

అప్పుడు చెప్పాడు గోపి.

''రాధా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను.''

''ఎంత మాటన్నావు గోపీ!'' వాపోయింది రాణి.

''నేనేమన్నాను రాధా? నిన్ను ప్రేమిస్తున్నానన్నాను. అది తప్పుకాదే!'' తెగ ఆశ్చర్యపోయాడు గోపి.

''ఘోపీ! మళ్ళీ అదే తప్పు చేయకు'' కిందపడి గొల్లున విలపించింది రాణి.

అప్పుడు గోపీకి అనుమానం వచ్చింది.

ఇదివరకెవరన్నా రాణితో ఇలాగే ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేశారేమోనని. వెంటనే ప్లేటు ఫిరాయించాడు.

''చెల్లెమ్మా! చెప్పు. నిన్ను అన్యాయం చేసిన వాడు ఎవరైనా సరే వాడు ఎక్కడున్నా సరే! ఆఖరికి అమెరికాలో ఉన్నా సరే, వెంటనే మెయిన్ ఫ్రేమ్స్ కోర్సు చేసి వాడిని తీసుకొచ్చి నీ కాళ్ళ దగ్గర పడేస్తాను'' అన్నాడు.

''మెయిన్‌ఫ్రేమ్స్‌కి ఇప్పుడంత సీన్ లేదుగానీ, నువ్వు నన్ను మాటిమాటికీ చెల్లెమ్మా అనకు గోపీ! ఒళ్ళంతా చిల్లులు పొడుస్తున్నట్టుగా ఉంది'' అంది రాణి.

''హెంత మాటన్నావు చెల్లెమ్మా! ఈ అభాగ్యుడు నీకు హన్నగా కూడా పనికిరాడా! హయ్యో!!'' భోరుమన్నాడతను.

గోపి చీటికీ మాటికీ చెల్లెమ్మా అంటూ విసిగించేసరికి రాణిలో నేచురాలిటీ, నేటివిటీ కొంచెం బయటపడ్డాయి.

''ఏహె! నీ యబ్బ! ఎన్నిసార్లు చెప్పాలి నీకు? చెల్లీ అనకెహె! నన్నెవరూ మోసం చేయలేదు. నువ్వు నన్ను రాణీ అనకుండా మాటిమాటికీ రాధ అంటుంటే అనుమానం వచ్చింది. ఎవరన్నా రాధని ప్రేమిస్తున్నావేమోనని'' అప్పుడు చెప్పింది రాణి.


''తూచ్! నువ్వు నాకు చెల్లివి కాదుగా!!'' ముందు తూచ్ చెప్పుకుని తన తప్పు తుడిచేసుకున్నాడు గోపి.

తర్వాత గద్గద స్వరంతో చెప్పాడు.

''సినిమా చూడలేదా? గోపీ ఎప్పుడూ రాధనే ప్రేమించాలి రాణీ! కానీ నేను నిన్ను ప్రేమించాను. నువ్వే నా రాధవనుకున్నాను. కానీ నన్నే అనుమానించి ఇలా బాధపెడతావనుకోలేదు.''

''ఘోపీ! సారీఘోపీ! నిన్ను అపార్థం చేసుకున్నాను. నన్ను క్షమించు. నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు'' లబలబ లాడింది రాణి.

''ఫర్లేదులే కానీ, నాకొక చిన్న డౌటు - నువ్వెందుకు ఎప్పుడూ ఏడ్చినా ఒక కంట్లో నుంచే నీరొస్తుంది? ఇంతకీ నువ్వు నా ప్రేమని




అంగీకరించినట్టేనా?'' ఆశగా అన్నాడు గోపి.

''ఆశ! అప్పుడేనా! ముందు ఈ విషయం తేల్చు. పాము కప్పని ప్రేమిస్తుంది తిండికోసం. ఆవు దూడని ప్రేమిస్తుంది గుండెకోసం. నీది ఏ ప్రేమ?'' అడిగింది రాణి.

''మనిషి కుక్కని ప్రేమిస్తాడు. తన ఇంటికి కాపలా కొస్తుందని. కుక్క కూడా మనిషిని ప్రేమిస్తుంది. కేవలం విశ్వాసంతో, మనిషి ప్రేమలో స్వార్థం ఉంటుంది. కుక్కలో స్వార్థం ఉండదు. నాది కుక్క ప్రేమేకానీ, మనిషి ప్రేమ కాదు రాధా!'' అసలు విషయం బయటపెట్టాడు గోపి.

''అయితే సరే! నేను నీ ప్రేమని ఆక్సెప్ట్ చేస్తున్నా!'' గొప్ప వరమిచ్చినట్టుగా ఫోజు పెట్టింది రాణి.

అంతే! గోపీ తన చేతిలో ఉన్న గులాబీని జిపక్, జిపక్‌మని ఒక్క ఊపు ఊపాడు. ఆ అతి ఊపుడుకి తట్టుకోలేని గులాబీ రెక్కలన్నీ ఊడిపోయాయి. అది చూసుకోకుండా రాణినే చూస్తూ తన్మయత్వంతో ఆమె చేతిలో పెట్టాడు.

కెవ్వుమని అరిచింది రాణి.

''ఘోపీ! ఎంత పని చేశావు. ఎంత ఘని చేశావు?'' ఒక కంట్లోంచి నీళ్ళు బొటబొటా కార్చింది.

''నా మనసేదో కీడుని శంకిస్తోంది ఘోపీ! నా జీవితం కూడా అలా మోడువారిన ఘులాబీ అవుతుందేమోనని. అయ్యో! నీకేమన్నా జరిగితే నేనెలా బ్రతకాలి. చెప్పు గోపీ! చెప్పు'' రోదిస్తూ గోపీ కాలరుచ్చుకుని కుదిపేసింది.

ఒక్క క్షణం బిత్తరపోయి అన్నాడతను.

''అలాగనే ఎందుకనుకోవాలి రాధా! కిందపడ్డ గులాబీ రెక్కలన్నీ నీ పాదాల మీదే పడ్డాయి చూడు. అదే పుష్పాభిషేకం. నా ప్రేమాభిషేకం!''

''అబ్బ! నీకెన్ని విషయాలు తెలుసు గోపీ!'' ఆరాధనగా చూస్తూ అందామె.

తర్వాత గోపీ, రాణికి తను రాసిన కవిత చదివి వినిపించాడు.

''ఒసే నా జిలేబీ,
అందుకో నా గులాబీ,
సిగ్గుపడకు బేబీ,
నిన్ను ప్రేమించడమే నాకు హాబీ!''

అలా ఇద్దరూ చాలాసేపు ఎడాపెడా ప్రేమించేసుకున్నారు.

☆ ☆ ☆

''మన ప్రేమకి మన పెద్ద వాళ్ళొప్పుకోవటం లేదుగా! ఏం చేద్దాం గోపీ?'' అడిగింది రాణి.

సీరియస్‌గా వెళ్ళి గదిమూలనున్న కిటికీ తలుపుమీద చేయివేసి కిటికీలో నుంచి బయటికి చూస్తూ నిలబడ్డాడు గోపీ.

ఓ రెండు, మూడు గంటలు మౌనం పాటించాక అన్నాడు గోపీ.

''నిన్ను నేనెలాగైనా సరే పెళ్ళాడతాను రాధా!''

''ఎలా చేసుకుంటావు గోపీ? ఎలా సాధ్యమవుతుందది?'' గోపీని గిలకొట్టి మరీ అడిగింది రాణి.

మరో మూలనున్న కిటికీ దగ్గరికి వెళ్ళి అందులో నుంచి బయటికి చూస్తూ అన్నాడు ''అదే ఆలోచిస్తున్నాను రాధా!''

''అంతేలే! నీకు నా మీద ప్రేమ పోయింది. అందుకే నా వైపు కూడా చూడకుండా మాటిమాటకీ కిటికీల దగ్గరికి పరుగెత్తుతున్నావు'' ఉక్రోషంగా అని కాళ్ళు నేలకేసి తప, తపా కొట్టింది రాణి.

''పిచ్చిరాధా! నువ్వు నన్ను అర్థం చేసుకున్నది ఇదేనా? నీకు బొత్తిగా సినిమా నాలెడ్జ్ లేదు. ఎంత సీరియస్ విషయం మాట్లాడుకుంటుంటే అంత దూరంగా ఉన్న కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడి శూన్యంలోకి చూడాలి''

''నా గోపీకి ఎన్ని విషయాలు తెలుసో!''

కాసేపటి తర్వాత అంది రాణి.

''పోనీ, మనం ఎక్కడికన్నా పారిపోదామా?''

గోపీ అదిరిపడ్డట్టుగా చూశాడు.

తర్వాత తల పంకించాడు.

కాసేపు రకరకాల అన్ రిలేటెడ్ ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చాక, తలుపు తీసుకుని బయటికి నడిచాడు. అతని వెంటపడింది రాణి.

ఎదురింటి తలుపు తట్టాడు.

ఆ ఇంటావిడ తలుపు తీయగానే గోపీని చూసి మొహం గంటు పెట్టుకుని అంది.

''మళ్ళీ వచ్చావా నాయనా! నీ వెధవ ఆలోచనలకి మా ఇంట్లో కిటికీనే దొరికిందా! నీతో నే చావలేను. మా ఆయనసలే వుత్త అనుమానం మనిషి. నీకు దణ్ణం పెడతాను. నన్నిలా బతకనీ. నా కాపురంలో నిప్పులు పోయక్కు.''

''చూశావా ఆంటీ, నీకెంత స్వార్థమో! పెళ్ళయి ఇరవయ్యేళ్ళయినా ఇంకా కాపురం మీద మోజు పోలేదు. మరి మేమింకా పెళ్ళే చేసుకోలేదు. మాకెలా ఉంటుంది'' అని ఆవిడని గభాల్న తోసేసి వాళ్ళింట్లోకి జొరబడ్డాడు గోపీ.

కిటికీ దగ్గరికి వెళ్ళి ఆలోచించసాగాడు.

''దొంగ సచ్చినోడు. వీడి సినిమా పిచ్చి నాశనం కాను. వీడిని ఈయన ఇంట్లో చూస్తే ఇంకేమైనా ఉందా?'' గొణుక్కుంటూ కూర్చుందావిడ.

అలాగే కిటికీలో నుంచి బయటికి చూస్తూ అన్నాడు గోపీ.

''నువ్వన్నట్టే చేద్దాం! నీ నగలు, డబ్బు అన్నీ ఎత్తుకొచ్చేయ్.''

''ఆరి సచ్చినోడా! నేను నగలు, డబ్బు తీసుకుని నీతో రావాలా? నీకెంత ధైర్యం? హమ్మో! అసలు మా ఆయన వింటే ఇంకేమైనా ఉందా! అసలే ఆయన ...''

ఆమె మాటల్ని కట్‌చేసి చెప్పింది రాణి.

''నిన్ను కాదాంటీ? నన్ను ...''

హాయిగా ఊపిరి పీల్చుకుని అంది ఆంటీ!

''ఆ పని చేయి తల్లీ! వాడిని తీసుకుని ఎక్కడికన్నా పారిపో! మళ్ళీ పొరబాటున కూడా ఇటు రాకండి.''

చిలిపిగా చూస్తూ ఆంటీ బుగ్గ గిల్లి అన్నాడు గోపి.

''ఊరుకో ఆంటీ! నీకు మరీ ఆశెక్కువ. నేనెక్కడ ఉన్నాసరే, ఆలోచించుకోవటానికి నీ ఇంటికే వస్తాను.''

హతాశురాలైన ఆంటీ కుప్ప కూలింది.

సీన్ కట్ చేస్తే ...

☆ ☆ ☆

రాణి తన నగలు, డబ్బు అంతా పెద్ద మూటకట్టి మూలుగుతూ రైల్వే స్టేషన్‌లోకి అడుగుబెట్టింది.

గోపి అప్పటికే ట్రైన్ టికెట్స్‌తో రెడీగా ఉన్నాడు.

ఇద్దరూ ట్రైన్ ఎక్కి మరో ఊళ్ళో దిగారు.

ట్రెయిన్ దిగేసరికి రాణి, గోపి మురికిగా, చిరిగిపోయిన బట్టలతో ఉన్నారు (హల్లో టెల్గూస్! 'రాధ డబ్బు, నగలు ఏమయ్యాయి? వాళ్ళు వెళ్ళింది పక్క ఊరికే గదా! దానికే వాళ్ళ బట్టలు చిరిగి, వాళ్ళు మురికి కొట్టుకు పోయారేంటి?'' - లాంటిక్వశ్చన్స్ అడగకండి. కళ్ళు మిటకరించి తెలుగు సినిమాలు చూసేటప్పుడు రావే ఇలాంటి డౌట్లు? నా కథ చదువుతూ నన్ను మాత్రం అడుగుతానంటే నేనూరుకుంటానా? హన్నా!!)

దిగానే ఊరు చివర మాంచి స్పాట్ చూసుకుని వాళ్ళిద్దరే ఆడుతూ, పాడుతూ, మధ్య, మధ్యలో ఏడుస్తూ స్పీడ్‌గా గంటలో ఒక అందమైన ఇల్లు కట్టేసుకున్నారు. (ఇలా ఎక్కడ పడితే అక్కడ ఇళ్ళు కట్టేసుకోవచ్చా? అని ఆలోచించుకుని, ఊరి పొలిమేరలు ఆక్రమించటానికి రెడీ అవుతున్నారా చాలా మంది చిలిపి టెల్గూస్? సారీ! చంద్రబాబు గారు దేశం నలుమూలలకీ కాన్ఫరెన్స్ కాల్స్ కలిపి, మిమ్మల్ని స్పీకర్ ఫోన్ మీద పెట్టి అందరికీ తెలిసేలా తిట్టి, టెంకిజెల్లలు కొట్టగలరు. జాగ్రత్త! ఇవన్నీ సినిమాలు, కథలకే పరిమితం)

☆☆☆

ఆవేశంగా వెళ్ళి ఒక తాడు తెచ్చి, చెట్టుకొమ్మని విరిచి తాడుకి కట్టి రాణి మెళ్ళో వేశాడు గోపి.

''గోపీ! యాఖ్. ఇదేంటీ? గోల్డ్ చెయిన్, మంగళసూత్రాలు లేకపోతే లేవు. కనీసం సినిమాల్లో లాగా దారం, పసుపుకొమ్ము కూడా కాకుండా ఈ చాంతాడు, చెట్టుకొమ్మ ఏమిటీ?'' అంది రాణి.

''అంత మాటనకు రాధా? అది ఒట్టి కొమ్మ కాదు. మన కలలకు పట్టుగొమ్మ'' ముక్కు పూరీలా చేసి చెప్పాడు గోపి.

అయినా సరే! రాణికి కాస్త బాధగానే వుంది.

''ఏదో ఒకటిలే! నీ బొంద'' సణుక్కుంటూ కూర్చుంది.

ఎప్పటిలా ''అబ్బ! నీకెంత తెలివి గోపీ!'' అని అనలేదు. ఎందుకంటే వాళ్ళకి పెళ్ళయిపోయింది కదా!

☆☆☆

ఎంత ప్రయత్నించినా గోపికి ఉద్యోగం దొరకలేదు.

అలాగే రెండు రోజులు తిండి, నీళ్ళు కూడా లేకుండా గడిపారు గోపీ, రాణి.

సరిగ్గా మూడో రోజు గోపీకి ఉద్యోగం దొరికింది.

రిక్షాలాగే ఉద్యోగం.

ఆ రోజు సాయంత్రం గోపీ ఆనందంగా వచ్చాడు. తిండిలేక సొమ్మసిల్లిన రాణిని నిద్రలేపి తను తెచ్చినవన్నీ చూపించాడు.

రాణి కళ్ళు జిగేల్మన్నాయి.

''నీకోసం మటన్ బిర్యానీ, పువ్వులు, వజ్రాల నెక్లెస్ తెచ్చాను రాధా!'' చెప్పాడు గోపి.

''నాధా!''


''రాధా!''

☆☆☆

మర్నాడు ఆటో కొనుక్కొచ్చాడు గోపీ.

''రాధా! నేను రక్తాన్ని చెమటగా మార్చి కష్టపడ్డాను. నా కష్టానికి ఫలితం దక్కింది. రిక్షాలాగి సంపాదించిన డబ్బుతో ఆటో కొన్నాను. ఇది ఆటో మాత్రమే కాదు. మన ప్రేమకి రిమోట్!''

ఇద్దరూ కష్టపడి కట్టుకున్న లంకంత ఇంట్లో అటూ, ఇటూ పరుగులు పెడుతూ, రాధ కోసం వెతుకుతూ చెప్పాడు గోపి.




''గోపీ! మరి నీకు నా బహుమతి ఏంటో తెలుసా?'' చిలిపిగా చూస్తూ అడిగింది వంటింట్లో నుంచి బయటికొచ్చిన రాణి.

''ఏమిటది రాధా?'' ఆనందంగా అడిగాడు గోపి.

పదేళ్ళ పిల్లాడిని వంటింట్లో నుంచి బయటికి లాక్కొచ్చి చూపించింది రాణి. ''మన అబ్బాయి!''

''రాధా!'' ఆనందంతో కెవ్వున అరిచి రాణిని ఎత్తుకుని గిరగిరా తిప్పబోయి ధబ్బున కిందపడ్డాడు గోపి.

ఆ శబ్దానికి భయపడ్డ పిల్లవాడు తుర్రున బయటికి పారిపోయాడు.

అప్పుడు తట్టింది గోపికి.

''మన పెళ్ళయి ఇంకా మూడు రోజులయినా కాలేదు. అప్పుడే పిల్లలా? అదీ ఇంత పెద్దవాడా?'' అయోమయంగా అడిగాడు.

''కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుట్టడం అంటే ఇదే గోపీ!'' చెప్పింది రాధ.

''అయినా మరీ ఇంత ...'' అనుమానంగా చూస్తూ అన్నాడు.

గోపి డొక్కలో తంతూ, దొర్లి, దొర్లి నవ్వుతూ చెప్పింది రాణి.

''జోక్ చేశానుగా! వాడు మన పక్కింటి పిల్లవాడుగా!'' (ఊరు బయట ఎవరూ లేని చోట వాళ్ళు ఇల్లు కట్టుకుంటే, మరి ఈ పక్కింటి పిల్లవాడెవరూ? అదేమిటీ అంటున్నారా? - ఏమో నాక్కూడా తెలీదు. అదంతే! నో మోర్ క్వశ్చన్స్ ప్లీజ్!)

☆☆☆

ఒకరోజంతా కష్టపడి ఆటో నడపగా వచ్చిన డబ్బుతో బస్ కొన్నాడు గోపి.

ఇంకో రెండు రోజులకి యాభై బస్సులు, ఒక ఫైవ్‌స్టార్ హోటల్, రెండు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీలకి అధిపతి అయ్యాడు గోపి.

రాణి మాత్రం ఇంకా మెడలో చెట్టు కొమ్మని అలాగే ఉంచుకుంది. మరదే పతి భక్తి అంటే ...!!

గోపీ 'గోపీ బాబుగోరు' అయ్యారు.

(ఇది నిజమని మీరు నమ్మకపోతే మీ కంపెనీ ఓనర్‌ని అడగండి. ఈ కథ రాసి ఇప్పటికి వారం రోజులవుతుంది. కాబట్టి గోపీ గారి ఎదుగుదలని బట్టి చూస్తే ఖచ్చితంగా ఈ పాటికి మీ కంపెనీని కూడా కొనేసే ఉంటారు)

ఇరవయ్యేళ్ళకే పట్టుపంచె, తెల్లలాల్చీ, భుజాన కండువా వేసుకుని, చేతిలో సిగరెట్లని మాటిమాటికి గిరికీలు కొట్టిస్తూ, పెద్ద కార్లలో గంభీరంగా తిరిగే ఆయన్ని మీరెప్పుడన్నా చూశారా?

ఆయనే గోపీ బాబుగోరు.

ఎస్! దటీజ్ గోపీ!!!

జిఫక్! జిఫక్!!!